క్లుప్తంగా

జయంత్యుత్సవ వైభవం

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో స్వామివారి జయంతి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూడోరోజు స్వామివారికి విశేషాభిషేకం చేశారు. యాగ మండపంలో యాజ్ఞికులు నర్సింహ మూల మంత్ర హవనం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భారీగా సత్యనారాయణ వ్రతాలు జరిగాయి.

ఇసుక రవాణాను అడ్డుకోండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అక్కేనపల్లి గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): పెద్దవాగు నుంచి ఇష్టారీతిగా ఇసుక రవాణా చేస్తున్నారని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అక్కేనపల్లి గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి వచ్చిన జిల్లా కలెక్టర్‌తో గ్రామస్తులు తమ గోడును వెల్లబోసుకున్నారు. అక్కేనపల్లి పెద్దవాగు నుంచి రాత్రి పూట ఇసుక రవాణా చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే మాకు సంబంధం లేదని సమాధానం ఇస్తున్నారన్నారు. అదేవిధంగా స్థానిక తహసీల్దార్, ఆర్‌ఐ ఇసుక వ్యాపారాలతో కుమ్మక్కై అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన కలెక్టర్ జిల్లా అధికారులతో ఆకస్మిక దాడులు చేయిస్తామని గ్రామస్తులకు సమాధానం ఇచ్చారు.

చెరువును కబ్జా చేస్తున్నారు



వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్‌లు

నంగునూరు(సిద్దిపేట): చెరువులో అక్రమ నిర్మాణాలు చేపట్టి చౌడి చెరువును కబ్జా చేస్తున్నారని నంగునూరు ముదిరాజ్ సంఘం సభ్యులు బుధవారం మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు చేశారు. నీటితో కళకళలాడుతున్న చౌడి చెరువులో 380 కుటుంబాలు చేపపిల్లల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న చెరువు శిఖంను స్థానిక నాయకులు కబ్జా చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ఇటీవల ఎంపీడీఓ కార్యాలయాన్ని కూల్చివేసిన మట్టితోనే చెరువును పూడ్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.

వైభవంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో భజనలు చేస్తున్న మహిళలు

హుస్నాబాద్: పట్టణంలోని సిద్దేశ్వర గుట్టపై కొలువైన సంతోషిమాత ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో పుణ్యాహవచనం, హోమం, అభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు లలితా పారాయణం భజనలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి సంతోషిమాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆలయ కమిటీ చైర్మన్ కొత్తపల్లి అశోక్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వధువుకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని అక్కారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శ్రీనివాస్ పెద్ద కూతురు లావణ్య వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో వాటర్‌ప్లాంట్‌కు సంబంధించిన ఆటో ప్రమాదానికి గురికావడంతో శ్రీనివాస్‌కు కాలు విరిగి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ బాల్‌చంద్రంతో పాటు గ్రామ యువత, గ్రామస్తులంతా కలిసి శ్రీనివాస్ కూతురు లావణ్య వివాహం సందర్భంగా బుధవారం సుమారు రూ.25వేల ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో గ్రామ యువత రవి, ప్రభాకర్‌రెడ్డి, అనిల్, శ్రీను, రాజు, మల్లేశం, స్వామిగౌడ్, నరేశ్, ఖలీల్, రాకేశ్, నర్సింలు, పరశురాములు, బాల్‌రాజు, ఎల్లం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్మొద్దు

- ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్
- గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



దుబ్బాక: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక: రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల స్వామి, బాలకృష్ణగౌడ్, కనకయ్య, కో–ఆప్షన్ మెంబర్ పెంటమ్మ, మెప్మా సీఈఓ రేణుక, తదితరులున్నారు. అదేవిధంగా లచ్చపేట వార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నంద్యాల శ్రీజశ్రీకాంత్, బంగారయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బాల్‌రాజ్ తదితరులున్నారు.

దుబ్బాకరూరల్: మండంలోని రామక్కపేట, రఘోత్తంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అంతకు ముందు ఎంపీపీ కొత్త పుష్పలత, ఏఎంసీ చైర్మన్ శేర్ల కైలాష్‌లతో కలిసి పోతారం, వెంకటగిరితాండ, శిలాజీనగర్, గోసాన్‌పల్లి, గంభీర్‌పూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పద్మప్రభాకర్, దేవిరెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, పెంటవ్వ, పీఏసీఎస్ డైరెక్టర్ బాల్‌రాజ్, బంగారయ్య, ఎంపీటీసీలు లక్ష్మీనారాగౌడ్, శోభస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మిరుదొడ్డి(దుబ్బాక): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మిలింగం అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన మిరుదొడ్డితో పాటు, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రాజు, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ. అహ్మద్, ఎంపీటీసీ నర్సింలు, సర్పంచ్ రాములు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: గోనెపల్లిలో..

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని రాఘవాపూర్, పెద్దలింగారెడ్డిపల్లి, రాంపూర్, రావురూకుల, గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది కృష్ణ, సర్పంచ్‌లు రమేశ్, ఉదయశ్రీతిరుపతి, కవితరవీందర్, భిక్షపతి, ఏఈఓలు గీత, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందుల, తుక్కాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మల్లయ్య, చంద్రం, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, పీఏసీఎస్ సీఈవో గంగిరెడ్డి, ఐకేపీ ఏపీఎం మగ్దూం, ఏఎంసీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముల్కల కనకరాజు అన్నారు. మండల పరిధిలోని గోనెపల్లి, కస్తూరిపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు స్వరూపఎల్లాగౌడ్, పద్మస్వామి, ఎంపీటీసీ పద్మ పాల్గొన్నారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



ఎంపీని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

దుబ్బాకరూరల్: మండలంలోని రఘోత్తంపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ ఉత్సవాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సంమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరారు. కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ కొద్దిసేపు డప్పు వాయించారు. అనంతరం వారిని నిర్వాహకులు సన్మానించారు.

ఘనంగా వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ వేణుగోపాలుడి కోవెలలో బుధవారం రాత్రి స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వేదాంతం మురళీధరాచార్యులు, సంపత్ కుమారాచార్యుల నేతృత్వంలో ఆలయ ముఖ మండపంలో వేదికపై రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలుని ఉత్సవ మూర్తులను ఆసీనులను చేశారు. పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, మృత్సంగ్రహణం కార్యక్రమాలు నిర్వహించారు. గీతాజ్ఞాన మండలి ప్రతినిధి రాజులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టేకులపల్లి రాంరెడ్డి దంపతుల సమక్షంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేసి హారతి, మంత్ర పుష్పం అనంతరం ప్రసాద వితరణ చేశారు.

గీత కార్మికులకు అండగా ప్రభుత్వం



క్షీరాభిషేకం చేస్తున్న గీత కార్మికులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని గౌడ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె బాలకిషన్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సర్వాయి పాపన్న చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం కార్యదర్శి యాదగిరిగౌడ్, గీత కార్మిక యూనియన్ అధ్యక్షుడు రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశంగౌడ్, బాల్‌రాజుగౌడ్, అంజయ్యగౌడ్, మహేశ్‌గౌడ్, బాలకిషన్‌గౌడ్, హరీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): గీత కార్మికులకు గీత బీమా ద్వారా అకస్మికంగా మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షలు అందించడం హర్షణీయమని దూళ్మిట్ట సర్పంచ్ దీపికవేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు దూళ్మిట్టలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగం, కనకయ్యగౌడ్, నర్సింలుగౌడ్, సాయిలు, సత్తయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాస్, లింగం, రాములు, అశోక్, చంద్రయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల కల సీఎం కేసీఆర్ చొరవ, మంత్రి హరీశ్‌రావు సహకారంతో నెరవేరుతోందని ప్రతాప్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రూ.3.81కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీకి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దిన్, ఆర్టీసీ డీఎం సురేఖ, బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాగా అనారోగ్యంతో బాధపడుతున్న కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి కొమ్ము యాదగిరితోపాటు మరొకరికి రూ.లక్ష చొప్పున ఎల్‌ఓసీలను పట్టణంలోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ప్రతాప్ రెడ్డి అందజేశారు.

దుబ్బాక అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక: దుబ్బాక అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలో నిర్మాణంలో ఉన్న మయబ్రహ్మ వడ్రంగి కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి పెండింగ్ పనుల నిమిత్తం ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5లక్షల నిధులను మంజూరు చేసి ప్రొసీడింగ్ కాపీని సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుంకోజ్ ప్రవీణ్‌కుమార్, సప్తగిరి, సంఘంసభ్యులు, తదితరులున్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



వడ్రంగి సంఘం సభ్యులతో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

వేతన పెంపుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

దుబ్బాక: పారిశుధ్య కార్మికులకు అదనంగా రూ.1000 వేతనం పెంచడంతో రాయపోల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ముంగిస్‌పల్లి గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్వరాజ్యం సాధించాలని వినూత్న పథకాలు ప్రవేశపెట్టి గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. సీఎం కేసీఆర్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు భరత్, ఎల్లయ్య, నర్సయ్య, లక్ష్మి, ఎల్లవ్వ, రాజు, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు తదితరులున్నారు.

గజ్వేల్‌రూరల్: పారిశుధ్య కార్మికులకు వేతనాలను పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు గజ్వేల్ జెడ్పీటీసీ మల్లేశం పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శిల్పఅశోక్, ఉపసర్పంచ్ స్వామి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్, నాయకులు స్వామి, రాజు, సంతోష్, రాములు, శివరాజ్, ప్రభాకర్, శేఖర్, నర్సింహారెడ్డి, అశోక్ రెడ్డి, రాములు పాల్గొన్నారు.

కేదారేశ్వరుని సన్నిధిలో అన్నదానం



భక్తులకు భోజనం అందిస్తున్న సేవా సమితి సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేదారేశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిద్దిపేటకు చెందిన కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం, భోజనం అందిస్తున్నారు. మూడు సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని వారు కొనసాగిస్తున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బెజ్జంకి: బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



హుస్నాబాద్‌రూరల్: బోనాల ఊరేగింపులో భక్తులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా బుధవారం పోచమ్మ బోనాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మొదట సుదర్శన సహిత రుద్రహవనం, వేద స్వస్తి యాగశాల ప్రవేశం, దేవతా హవనం, జలధివాసం నిర్వహించారు. అనంతరం భారీ సంఖ్యలో మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సర్పంచ్ దేవ రాజశ్రీ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గురువారం గోపూజ, మహాపూర్ణాహుతి, అనంతరం బొడ్రాయిని ప్రతిష్ఠించి అన్నప్రసాదం వితరణ ఉంటుందని సర్పంచ్ దేవ రాజశ్రీ తెలిపారు.

పోతారం(ఎస్)లో..

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం (ఎస్)లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. గురువారం రోజున కులదైవం పెద్దమ్మ బోనాలు చేస్తున్నట్లు సర్పంచ్ బత్తిని సాయిలు తెలిపారు. చెరువులోకి నీళ్లు చేరి మత్స్య సంపద అభివృద్ధి చెందాలని కోరుతూ గ్రామ దేవతలకు ప్రతి ఏటా బోనాలు చేస్తామని సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెసరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

బహిరంగ సభను విజయవంతం చేయండి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: పట్టణంలో ఈ నెల 5న మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొనే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన హెలిప్యాడ్, ఇండోర్ స్టేడియం, బస్ డిపో గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారన్నారు. ఈ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 50 వేల మందికిపైగా జనసమీకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. సభకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ లకావత్ మానస, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ జెడ్పీటీసీ బీలునాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్‌పాషా, కౌన్సిలర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పట్టణంలోని 2వ వార్డులో కనకదుర్గ ఆలయ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారు శక్తి స్వరూపురాలని అన్నారు. ఈ ప్రాంతంలో కనకదుర్గ మాత ఆలయం నిర్మించడం శుభపరిణామమన్నారు. అమ్మవారి దీవెనలు ఈ ప్రాంత ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్లు బోజు రమరవీందర్, హరీశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మర్కూక్(గజ్వేల్): వరదరాజస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టూ పక్క గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో పునీతులయ్యారు. సర్పంచ్ అప్పల ప్రవీణ్ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సాయంత్రం స్వామివారిని హంస వాహన పల్లకీపై ఊరేగించి కల్యాణ ఘట్టం నిర్వహించారు. జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందజేస్తున్న కారోబార్లు, సిబ్బంది

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లు ఈ నెల 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు బుధవారం ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డికి సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కారోబార్లు, సిబ్బంది యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భూక్య రమేశ్, వేల్పుల రాజు, పిట్టల ఆశయ, మాతంగి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని కొమురవెల్లి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు బుధవారం సర్పంచ్ సార్ల లతకు సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకుండా రూ.1000లు వేతనం పెంచడం సరికాదన్నారు. ఈ నెల 5తేదీ నుంచి చేస్తున్నట్లు తెలిపారు.

అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించాలి



ట్రైనీ కలెక్టర్ ఫైజన్ అహ్మద్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

హుస్నాబాద్: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను భూమిలేని నిరుపేదలకు కేటాయించాలని ట్రైనీ కలెక్టర్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఫైజన్ అహ్మద్‌ను బుధవారం సీపీఐ నాయకులు కలిసి విన్నవించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో జరిగిన అవినీతిపై విచారణ జరపకుండా ఇళ్ల పట్టాలు ఇవ్వడం సరికాదన్నారు. అనర్హులను తొలగించి అర్హులైన వారికి ఇళ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గతంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. భూములు ఉన్న వారికి ఇళ్లు కేటాయిస్తే వారు అమ్ముకుంటారని, పేదలకు ఇళ్లు ఇస్తే నివాసం ఉంటారని తెలిపారు. అనర్హులను తొలగించిన తర్వాతే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని లేదంటే పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు సంజీవరెడ్డి, రాజ్‌కుమార్, నేలవేని స్వప్న, పొన్నాల స్వప్న, ఎల్లయ్య, కుజరత్ అలీ తదితరులు ఉన్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు



చేర్యాల(సిద్దిపేట): ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆకునూరు నుంచి చేర్యాలకు వచ్చేదారిలో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన చెట్టు. వడగండ్ల వానకు రోడ్డు పక్క ఉన్న చెట్టు రోడ్డుపై కూలింది. చెట్టుకూలి రోజులు గడుస్తున్నా గ్రామ పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్టును తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జవాన్ కుటుంబానికి చెక్కు అందజేత

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ బొంగురం మహేందర్ రెడ్డి ఇటీవల మృతి చెందాడు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును బాధిత కుటుంబానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ రాంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పద్మయ్య, బక్కి వెంకటయ్య, రొట్టె రాజమౌళి, నాయకులు శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ జెండా గద్దె ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని కాంచిట్ చౌరస్తా ఆవరణలో కాంగ్రెస్ జెండా గద్దె ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వాహబ్, గాయసుద్దిన్, ఫయాజ్ పాల్గొన్నారు.

◆ ఇళ్ల కేటాయింపులో పేదలకు అన్యాయం

హుస్నాబాద్: పట్టణంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుల్లో అర్హులకు అన్యాయం జరిగిందని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తప్పుల తడక డబుల్ బెడ్రూం ఇళ్ల జాబితా, భూ కబ్జాలు, ఇసుక మాఫియాపై ఈ నెల 5న హుస్నాబాద్‌కు వస్తున్న మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అనర్హులను తొలగించి అర్హులైన నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశాడు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టును పూర్తి చేయించాలని, హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో నాయకులు సుంకరి శ్రీనివాస్, జానకిరాంరెడ్డి, జనార్దన్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

◆ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత కరాటే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలేషంగౌడ్ అన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్‌లో శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మి, కరాటే మాస్టర్ అంజనేయులు పాల్గొన్నారు.

◆ పాలిసెట్ మెటీరియల్ పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏబీవీపీ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు పాలిసెట్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ మెదక్ విభాగ్ సంపర్క ప్రముఖ్ రాఘవులు హాజరై మాట్లాడుతూ.. విద్యార్థి పరిషత్ విద్యార్థుల సమస్యలపై అనేక కార్యక్రమాలతో పాటు, విద్యార్థుల శ్రేయస్సు కోసం నిర్మాణాత్మక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. అందులో విద్యార్థి వికాసానికి తోడ్పాటు పడేలా వేసవి సెలవుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులందరూ జాతీయ భావాన్ని పెంపొందించుకునే దిశగా పయనించాలని, దేశాన్ని సంరక్షించే బాధ్యత నేటి యువతరానికి ఉందన్నారు. స్వామి వివేకానంద ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వివేక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్వేత, తరగతుల కో–కన్వీనర్ అనీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.